
# (వా)ఋణం




"రావోయ్! రా..." మెల్లక్కి వరండా మీద కాలు మోపుతున్న గురుమూర్తిని పలకరించి బెంచీవేపు చూపించారు.

పరమేశ్వరరావుగారు చూపుతున్న ఆప్యాయతకి అర్థం తెలియకపోలేదు గురుమూర్తికి. తెలిసినా పట్టించుకోలేని స్థితిలో ఉన్నాడు.

కారణం- పక్కనే కొత్త నిక్కరు, కొత్త చొక్కాలో, బిక్కమొహం పెట్టి బిక్కు బిక్కుమంటూ దిక్కులు చూస్తున్న కొడుకు. గురుమూర్తి కొడుకు. కాదు... అమ్ముడుపోయాడు. ఇక గురుమూర్తి కొడుకు కాదు. పరమేశ్వరరావు గారి కొడుకు. కాదు— బానిస, సంతలో పశువుని కొన్నట్లు గురుమూర్తి కొడుకుని కొనుక్కున్నారు.

గురుమూర్తికి కళ్ళు తిరిగిన ట్లనిపించింది.

బెంచీమీద కూర్చుందామను కున్నాడు. కూర్చుంటే ఆ బెంచీకి అంటుకుపోతానేమో అని భయపడ్డాడు.

పరమేశ్వరరావుగారి కళ్లలో ఆనందం, ఆప్యాయత, మెరుపు, కన్నీటితడి— ఇంకా ఎన్నెన్నో గురుమూర్తికి అర్థం కానివి.

గురుమూర్తి చప్పిడి దవడల మీద కన్నీటిచారలు మాసిన గెడ్డం కప్పేసింది.

గురుమూర్తికి కర్తవ్యం గుర్తు కొచ్చింది. గబుక్కున కంటినీరు చూపుడు వేలితో తోసేసి, మురళి భుజం చుట్టూ ఆప్యాయంగా చెయ్యి వేస్తూ, "బాబూ... మురళీ..." అన్నాడు. గొంతులో ఏదో అడ్డం పడిన ట్లనిపించింది గురుమూర్తికి.

"రా... బాబూ... ఇలా రా." పరమేశ్వర్రావుగారు చేతులు చాపారు.

మురళి బెరుగ్గా తండ్రివేపు చూశాడు.

"వెళ్ళు, బాబూ... ఆయన నీకు చదువు చెప్పిస్తారు. నిన్ను స్కూల్లో చేర్పిస్తారు. మంచి పుస్తకాలు కొంటారు. వెళ్ళు, బాబూ..." 'మంచి తిండికూడా పెడతా'రన్న మాట గుండెల్లోనే దాచేసు కున్నాడు గురుమూర్తి.

పరమేశ్వర్రావుగారు ఈజీ చెయిర్లోంచి లేవబోయారు. గురుమూర్తి మురళిని ముందుకి తోసి తను వెనక్కి జరిగాడు.

మురళిని ఒళ్ళోకి తీసుకుని ఒళ్ళంతా ఆప్యాయంగా తడిమారు పరమేశ్వర్రావు గారు.

ఆకలేస్తే అన్నం పెట్టమని ఏడ్చి నప్పుడు అమ్మ ఒంటిమీద కొట్టిన దెబ్బలు గుర్తుకొచ్చాయి మురళికి.

ఆ అమ్మే ఈ వేళ ఉదయం తల స్నానం చేయించి, కొత్త బట్టలు తొడిగి, తియ్యగా తినడాని కిచ్చి, ఒళ్ళంతా ముద్దులతో నింపేసి, తనని పట్టుకు ఏడ్చిందికూడా గుర్తుకొచ్చింది మురళికి.

తన నెందుకు ఇక్కడికి తీసుకు వచ్చారో తెలియని వయసేం కాదు మురళిది. సరిగ్గా చదివిస్తే ఈపాటికి సెకండ్ ఫారమ్ చదువుతూండేవాడు. కాని, హైస్కూల్లో అడుగు పెట్టలేదు.

గురుమూర్తికి వేగం అక్కణ్ణించి వెళ్ళిపోవాలని ఉంది. ఆ ఉద్దేశ్యం గ్రహించి నట్టు, "సాయంత్రం రావోయ్ ... మిగిలింది తీసుకెళుదువుగాని. బాంకికి వెళ్ళి తీసుకురావాలి" అన్నారు పరమేశ్వ ర్రావుగారు.

గురుమూర్తికి ఒంటిమీద కొరడాతో కొట్టినట్టు అనిపించింది. త నెందుకా ఇంకా అక్కడ తచ్చాడుతున్నాడు?

మురళి జీవితం బాగుపడుతుంది. వాడు మంచి స్థితిలోకి వస్తాడు. సరిఅయిన పోషణా, చదువూ ఉంటే తన పిల్లలంతా మంచి స్థితికి వస్తారు. వాళ్ళంతా ధనాధిపతులు... గర్వంగా అనుకున్నాడు గురుమూర్తి.

నెమ్మదిగా నడుస్తున్న గురు మూర్తికి రాబోయే ఎనిమిది వందలూ ఏం చెయ్యాలన్న సమస్య ఎదురైంది.

తన కొడుకుని వాళ్ళకు పెంపకం ఇచ్చినందుకు ప్రతిఫలం వెయ్యి రూపాయలు. అందులో అడ్వాన్సుగా రెండు వందలు తీసేసుకున్నాడు. తన కొడుకు ఖరీదు వెయ్యి రూపాయలు!

ఇంటికి తన కొడుకుని అమ్మేశాడా? లేక తాకట్టు పెట్టాడా?

భారత్ స్టీల్ కార్పొరేషన్‌లో తగువు లేకుండా ఉండి, ఆ గుమాస్తా ఉద్యోగ మన్నా ఉంటే, ఈవాళ ఇలా కొడుకుని అమ్ముకోవలసిన గతి పట్టకపోనేమో?

అమ్మకం కాదు. తాకట్టు... తాకట్టు పెట్టాడు. మరైతే ఏ నాటికైనా తన కొడుకును విడిపించుకోగలడా?

* * *

"యాజులన్నయ్య చెప్పిన ఆ ఉద్యోగంలో చేరండి..." నీరసంగా అంది గురు మూర్తి భార్య వనజాక్షి.

"నీ కర్థం కాదు. చెపితే వినవు... ఆ దిక్కుమాలిన ఉద్యోగానికి వెయ్యి రూపాయలు లంచమా! లంచం ఇచ్చి ఉద్యోగం సంపాదించుకొనేకంటే చావు నయం..." కోపంగా అన్నాడు గురుమూర్తి.

"అది రాకే కదండీ... నే నిలా పడి ఉన్నాను! కుర్రవెధవల్ని చూడండి. ఎలా ఉన్నారో... పరమేశ్వర్రావుగా రిచ్చిన ఆ ఎనిమిది వందల్లో అయిదు వందలు వాళ్ళ మొహాన కొట్టండి. మిగతా అయిదు వందలూ జీతంలో నెలనెలా కొంత విరుచుకునేట్లు ఏర్పాటు చేస్తానన్నాడు యాజులన్నయ్య..." ఆయాసంతో ఆగిపోయింది ఆమె.

"వెధవ బతుక్కి ఆశయాలు, ఆదర్శాలు పనికిరావు." విసుక్కున్నాడు గురుమూర్తి.

"అవన్నీ కడుపు నిండిన వాళ్ళకండీ... పొట్ట చేత్తో పట్టుకున్న వాళ్ళకి ఆ

## అంగర వెంకట శివప్రసాదరావు

పొట్ట నిండడమే ఆశయం... ఆ పొట్టే వాళ్ల ఆదర్శం..." మెల్లగా అంది ఆమె.

"చాల్లే వెధవ్వాగుడు! నే నలా వెళ్ళి మీ యాజులన్నయ్యని కలుస్తా." విసురుగా వీధిలోకి వెళ్ళిపోయాడు గురుమూర్తి.

* * *

"వనజా... వనజా..."

"ఏమిటండీ...?"

"ఈ నెలతో ఆ అయిదు వందలూ పూర్తయిపోయాయి. వచ్చే నెల నుండి పూర్తి జీతం వస్తుంది. నీకు మంచి మందులు, టానిక్కులు కొనవచ్చు."

"అవ లా సీట్లో అంతకన్న ఎక్కువే వస్తుందట. మీ రేమో మడి కట్టుకు కూర్చుంటే ఎలా చెప్పండి?"

"వనజా! నువ్వుకూడా అదే మాట అంటున్నావా?"

"ఏం? తప్పు మాటన్నానా! ఆ కంట్రాక్టర్ల బిల్లులు వేగం 'పాస్' చేసేస్తే... వాళ్ళు ఆనందంగా వాళ్ళకి తోచింది వాళ్ళిస్తారు. మీరు పుచ్చుకోవ డంలో తప్పేముంది?"

"వాళ్ళ దగ్గర లంచం తీసుకో మంటావా!"

"నేను లంచం పుచ్చుకోమన్నానా? మీ రింత అని అడక్కండి. వాళ్ళెంతిస్తే అంతే పుచ్చుకోండి."

"నే చస్తే లంచం పుచ్చుకోను."

"చాల్లెండి మీ కబుర్లు... ఈ ఉద్యోగం లంచం ఇస్తేనే వచ్చిందన్న విషయం మరిచిపోతున్నారు." విసురుగా లోపలికి వెళ్ళిపోయింది వనజాక్షి.

చెంప ఛెళ్ళుమనిపించింది గురు మూర్తికి. ఆ ఉద్యోగం మానేద్దామనిపిం చింది. కాని, ఇప్పుడిప్పుడే చక్కబడుతున్న ఇల్లు, భార్య ఆరోగ్యం, పిల్లల మొహాల్లో వెలుగుతున్న ఆనందం గుర్తుకొచ్చాయి...


ఎవరి కోసం తను బతకాలి? ఎవరి కోసం లంచం పుచ్చుకోవాలి? వీళ్ల కోసం... వీళ్ల కోసమే ఇవన్నీ. వీళ్ల ఆనందమే నా ఆనందం. వీళ్ల బతుకే నా బతుకు... గురుమూర్తి మనసు ఆలోచనలతో నిండిపోయింది.

వనజాక్షి ఆరోగ్యం బాగుపడింది. పెద్దమ్మాయి సుశీలకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నాడు గురుమూర్తి. మిగిలిన పిల్లలందర్నీ స్కూల్లో చేర్పించాడు.

మునుపట్లా పాలవాడు గురుమూర్తి కూతురుతో పరాచికాలాడ్డం లేదు. మునుపైతే బాకీ తీర్చలేక, వాడితో తగువు పడలేక, వాడు తన కూతురితో పరాచికాలాడుతున్నా ఊరుకున్నాడు. ఇప్పుడైతే చెమ్డా లూడగొట్టి, ఎముకలు విరిచేస్తాడు.

మునుపైతే రాత్రులు నిద్దర ఉండేది కాదు. ఇప్పుడు నిద్దట్లో మధ్య మధ్య తెలివికూడా రాదు. మసి బారిన బుడ్డిదీపం అంటే అసహ్యం గురుమూర్తికి.

మొజాయిక్ ఫ్లోరింగ్ మేడ ఇంట్లో మెత్తటి పరుపులమీద పడుకునే గురుమూర్తికి మట్టిగోడలు, చింకి



బొంతలు, తాటిరేకు కమ్మల కప్పులు గుర్తుకు రావు.

కాఫీనీళ్ళు తాగాలనే కోరిక కారు కొనాలనే కోరికగా మారిపోయింది.

'ఇట్టే కరిగిపోతుందేమో?' అనిపించే వనజాక్షి కనులకింపుగా కనిపిస్తోంది గురుమూర్తికి.

* *

"పరమేశ్వర్రావుగారూ..." మును పట్లా దీనంగా, హీనంగాకాక దర్జాగా పిలిచి, గుమ్మం దగ్గర తచ్చాడకుండా లోపలికి అడుగు పెట్టాడు గురుమూర్తి.

గురుమూర్తి నడమంత్రపు సిరికి దారేమిటో తెలిసిన పరమేశ్వర్రావుగారు, అంతా తెలిసినా ఏం తెలియనట్లు నోరు మూసుకున్నారు. ఎందుకంటే, గురుమూర్తి డబ్బున్నవాడు.

ఈ నాడు మళ్ళీ గురుమూర్తి తన ఇంటికి ఎందుకు వచ్చాడో అర్థంకాక ఆశ్చర్యపోయారు పరమేశ్వర్రావుగారు.

క్షణంలో ఆశ్చర్యంనుండి తేరుకుని "కూర్చోండి..." అంటూ కుర్చీ చూపించి తను మాత్రం వినయంగా నిలబడిపోయారు.

గురుమూర్తి దర్జాగా సిగరెట్ ఆఖరి దమ్ము లాగి, సిగరెట్ పీక కింద పడేసి నలిపేస్తూ, "అబ్బాయేడీ?" అని అడిగాడు.

"ఈవేళే ఏదో కంపెనీలో ఇంటర్వ్యూ ఉందంటూ వెళ్ళేడు, బాబూ. మీకు తెలుసనుకుంటాను... అబ్బాయి డిగ్రీ పూర్తి చేశాడు." వార్ధక్యం ఒళ్ళంతా అలుముకున్న పరమేశ్వర్రావుగారు నుదుటి మీద చెమట తుడుచుకున్నారు.

"ఆఁ ... విన్నాన్లెండి." నలిగి పోయిన సిగరెట్ పీకనే చూస్తూ అన్నాడు గురుమూర్తి.

వంటింట్లో మెల్లగా గిన్నెల చప్పుడు వినిపిస్తోంది. గురుమూర్తి ఎందుకు వచ్చాడో అర్థం కాక తికమక పడు తున్నారు పరమేశ్వర్రావుగారు.

"ఉండండి ... కాస్త కాఫీ పంపమని లోపల చెప్పొస్తాను." లోపలికి వెళ్ల బోయాడు పరమేశ్వర్రావుగారు.

"అబ్బే ... వద్దులెండి. మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడుదామని వచ్చాను." గురుమూర్తి అన్నాడు.

"చెప్పండి" అని అన్నారేగాని పరమేశ్వర్రావుగారి గుండెల్లో దడ మొదలైంది. ఈ మధ్య ప్రతిదానికీ ఒంట్లో దడ పట్టుకుంది ఆయనకి.

"మరేం లేదు ... అబ్బాయిని తీసు కెళదామని వచ్చాను." చెప్పవలసిందేదో నెమ్మదిగా చెప్పేశాడు గురుమూర్తి.

సరిగ్గా ఆ నాడు గురుమూర్తికి కళ్ళు



రూపురేఖలు
చిత్రం— వై. బాలయ్య (సిద్దిపేట)

తిరిగినట్లే ఈ నాడు పరమేశ్వర్రావు గారికి తిరిగాయి.

"మీరేం అనుకోకండి ... ఇదుగో, రెండు వేలకి చెక్కు రాసి ఇస్తున్నాను." జేబులోంచి చెక్ బుక్కు తీసి వ్రాస్తున్న గురుమూర్తి, వీధి వరండాలో వచ్చి నిలుచున్న మురళిని, లోన గుమ్మంలో నిలబడిన తులసమ్మగారిని చూడలేదు.

చెక్కు వ్రాసి పరమేశ్వర్రావుగారికి అందివ్వబోయాడు గురుమూర్తి. ఆయన గోడకి ఆనుకుని నిలబడ్డారు. మొహమంతా చెమటలు పట్టేసింది. కళ్ళంట నీళ్ళు కారుతున్నాయి. ఆయన వాటిని తుడుచుకోవడానికి ప్రయత్నించ లేదు. తులసమ్మగారు గబుక్కున ఆయన దగ్గిర కొచ్చి పట్టుకున్నారు. లేకపోతే కింద పడిపోయేవారు. భార్య భుజం మీద మొహం పెట్టి భోరున ఏడ్చేశారు పరమేశ్వర్రావు గారు.

అర్థంకాక చూస్తున్నాడు గురు మూర్తి.

"నాన్నా!" అంటూ ముందు కొచ్చాడు మురళి.

"బాబూ ..." అన్న పిలుపు నోటి దాకా వచ్చి ఆగిపోయింది గురుమూర్తికి.

'వాడు తనని పిలవటం లేదు.' మనసులోనే అనుకున్నాడు.

మురళి పరమేశ్వర్రావుగారిని తన వేపు తిప్పుకుంటూ, "నాన్నా ... నాకు ఉద్యోగం వచ్చింది. నన్ను సెలెక్టు చేశారు. రేపే వచ్చి నన్ను డ్యూటీలో జాయిన్ అవమన్నారు" అన్నాడు.

"చూడు, బాబూ... వీరు మీ నాన్న గారు. నిన్ను చిన్నప్పుడు మాకు పెంపకం ఇచ్చారు. ఈ వేళ నిన్ను తీసుకెళ్లడానికి వచ్చారు. వెళ్ళు, బాబూ ... వారితో వెళ్ళు ..." దుఃఖం మింగేస్తూ అన్నారు పరమేశ్వర్రావుగారు.

"వారిచ్చే డబ్బు చూసి నన్ను పంపే స్తున్నారా, నాన్నా?"

"అవున్నా ... ఆ నాడు డబ్బిచ్చి కొనుక్కున్నాను. ఈ నాడు అంతకన్నా ఎక్కువ వస్తుంటే అమ్మేస్తున్నాను..."

"కాని, మీకొచ్చే లాభం కంటే ఎక్కువే నాకోసం మీరు ఖర్చుపెట్టారు. సంతలో పశువులా ఈ అమ్మకాలూ, కొనడాలేమిటి? నే వెళ్లను." మొండిగా అన్నాడు మురళి.

"వెళ్ళు, బాబూ... ఆ నాడు పరిస్థితి బాగులేక మా కిచ్చేశారు ... ఈ నాడు..."

మాట మధ్యలో అందుకొని, "పరిస్థితి బాగుంది కనక తీసుకెళ్ళడాని కొచ్చారు. ఇన్నాళ్ళు పెంచి, పోషించి, చదువు చెప్పించిన మీ కెందుకూ పనికి రాకుండా పోవడమేనా!

డబ్బు లేనప్పుడు అమ్ముకొని, ఉన్న ప్పుడు కొనుక్కోవడమా! ఆ నాడు లేని ఆప్యాయత, ఆదరణ ఈ నాడు వచ్చాయా? నే వెళ్ళను." విసురుగా లోపలికి వెళ్ళిపోయాడు మురళి.

"నన్ను క్షమించు, బాబూ. వాడు నా మాట వినటం లేదు." గురుమూర్తి చేతులు పట్టుకున్నారు పరమేశ్వర్రావు గారు.

"ఇందులో మీదేం ఉంది లెండి. . . ఇన్నాళ్ళూ డబ్బుంటే ఏమైనా కొనవచ్చనుకున్నాను. కాని . . . కాసే అమ్ముకున్న కొడుకుని తిరిగి కొనుక్కోలేక పోయాను..." గొణుక్కుంటూ గుమ్మం దిగి వెళ్ళిపోయాడు గురుమూర్తి.